కాలంవేసినకాటు +

రచన:
శ్రీ పి. కేశవరెడ్డి.

జూన్ నెల. ఎండ మిటమిట లాడుతూంది. పొలంలో ట్రాక్టరు తాడినవాడిలా తూలుతూ నడుస్తూంది. డ్రైవర్ మస్తాన్ ఒక చేత్తో నుదుటిమీది చెమటను తుడుచుకొంటూ మరో చేత్తో స్టీరింగును త్రిప్పుతున్నాడు.

ఉన్నట్లుండి ఇంజన్‌లోంచి 'బర్ ___' మని శబ్దం ప్రారంభమయింది. ముందుకు వంగి చూశాడు మస్తాన్. అతనికేమీ అర్థం కాలేదు. ఆ శబ్దం కర్ణపుటాల్ని బ్రద్దలు చేసేస్తూంది. ట్రాక్టర్ వేగం తగ్గిపోతూంది. చేతికందిన మీటలన్నీ నొక్కసాగాడు మస్తాన్. కొంత సేపటికి ట్రాక్టర్ కదలడం మానేసింది. కాని. ఇంజను మాత్రం ఇంకా రొద చేస్తూనేవుంది.

ఉసూరుమంటూ కిందికిదిగాడు మస్తాన్. ఇంజనుమీది పైకప్పును తీశేశాడు. ఇంజనులోని ప్రతి గొట్టాన్ని, మరని జాగ్రత్తగ పరిశీలించసాగాడు.

ఎంత సేపటికీ అందులో చెడిపోయిన భాగమేదో అంతుచిక్కలేదు.

క్రమంగా పైకెగబ్రాకుతున్నాడు సూర్యుడు. చెమటతో మస్తాన్ షర్టు తడిసిపోతూంది.

స్పానర్ వేసి ఒక్కొక్క మరనే తిప్పసాగాడు. అలా తిప్పుతూంటే అతని చేతులు పడిపోతున్నాయి. ఊడదీసిన మరను కంటికి దగ్గరగా పెట్టుకొని చూశాడు పాపం. అతనికి చూపుకూడ సరిగా ఆనడంలేదు.

ఇంజన్‌లోని అన్నిభాగాలు సవ్యంగానే ఉన్నాయని నిశ్చయించుకొన్నాడు మస్తాన్. మరి ఈ కఠోర శబ్దం రావడం ఎక్కడనుంచి?

ట్రాక్టర్ కిందికి మెల్లగ వ్రాకి, వెల్లకిలపడుకుని, అక్కడున్న భాగాలను పరిశీలించసాగాడు. ఇంజనులోంచి పెట్రోలు బొట్లుబొట్లుగ అతని బట్టలమీద పడుతోంది. పెట్రోలు వాసనతో అతనికి డోకు వచ్చేటట్లుగా వుంది.

చేతికందిన భాగాలన్నీ విడదీసి చెల్లాచెదరుగ పడేశాడు మస్తాన్. చివరకు చెడిపోయిన భాగాన్ని కనుగొన్నాడు. కాని, ఏం లాభం? ఆ భాగాన్ని సరిచేయాలంటే ఏ మెకానిక్కో రావాలి. ఇరవయ్యో, ముప్ఫయ్యో ఖర్చుపెట్టాలి. ప్రస్తుతం తనదగ్గరున్న సామగ్రిని ఉపయోగించి తాత్కాలికంగా యంత్రాన్ని బాగు చేశాడు మస్తాన్.

విడదీసిన మరలను యథాస్థానాల్లో బోడించి, స్టీరింగుముందు కూర్చొని స్టార్టు చేశాడు. ఊహూఁ! ఇంజను తన సొమ్మంతా ఎవరో దోచుకొన్నట్లు గొడవ చేస్తుందేగాని అంగుళం ముందుకు కదలదు.

తలపట్టుకొని కూర్చుండి పోయాడు మస్తాన్. ఇదీ రోజూ జరిగే తతంగం, రెండేళ్ళనుంచీ ప్రతిదినం యీ నరకయాతన పడుతూనే ఉన్నాడతను. తన బ్రతుకింత అధ్వాన్నంగా తయారవుతుందని అతను ఏనాడూ అనుకోలేదు.

\+ + +

అతను ఎనిమిదో తరగతి చదువుకున్నాడు. ఆ రోజులలో అతనెంతో చలాకీగా, మరెంతో అల్లరిగా వుండేవాడు. బరువు బాధ్యతలేవీ వుండేవికావు. అతనికిఇరవయ్యేళ్ళన్నా పూర్తి కాకముందే ఏదో కొంపలంటుకుపోతున్నట్లు ఒక 'బేగం'ను తెచ్చి కట్టబెట్టాడు వాళ్ళ నాన్న. దాంతో అతనిమీద అనేక బాధ్యతలుపడ్డాయి విధిలేక ఒక వర్క్‌షాప్‌లో చేరాడు. ఆ వర్క్‌షాప్‌లోనే తనను సీతాపతిగారు చూసి వెంట రమ్మన్నారు. తన యింట ట్రాక్టర్ డ్రైవర్‌గావుంటే అన్నం పెట్టడమేగాక, నెలకు అరవైరూపాయలిస్తామన్నారాయన. తనెంతో సంబరపడిపోయి పెళ్ళాంతో సహా ఈవూరొచ్చాడు.

ట్రాక్టర్‌తో పొలం దున్నడమంటే అతనికెంతో సరదాగా వుండేదారోజుల్లో. అతను స్టార్ట్ చెయ్యగానే లేడిలా ముందుకు దూసుకుపోయేది ట్రాక్టర్. ట్రాక్టర్ నడపడంలో తనకుగల కౌశలాన్ని తెగ మెచ్చుకొనేవారు సీతాపతిగారు.

సీతాపతిగారి దయవల్ల తన సంసారం సాఫీగా జరిగిపోతుండేది. కాని రోజులు గడిచేకొద్దీ కష్టకాలం ప్రారంభమయింది. ఆ కష్టపరంపరలో ఒకటి యీ ట్రాక్టర్. తను వచ్చినకొత్తలో ఇంజను నిర్దుష్టంగా వుండేది. ఇటీవల రెండేళ్ళనుంచీ అది అతన్ని నానాగడ్డి

కరిపిస్తూంది. ఇంజన్‌లోని చాలా భాగాలు చెడిపోయాయి. మరలు చాలావరకు అరిగిపోయాయి, కొన్ని విరిగిపోయాయి, మరికొన్ని తుప్పుపట్టిపోయాయి. క్రమంగా అది ఆరుగురు ఆడపిల్లల్ని కన్న తన 'బేగంలా'లా అయిపోయింది. స్టార్టుచేస్తే వూరూవాడా ఏకంచేస్తూ పెడబొబ్బలు పెడుతుంది. స్టార్టు చేసిన అరగంటకుగాని కదలదు. బ్రేకులు వేసిన అరగంటకుగాని ఆగదు. దాన్నో కూర్చొని ఉదయం బయలుదేరినవాడు, సలక్షణంగా సాయంత్రం తిరిగివస్తాడని నమ్మకంలేదు. బ్రేకులుకంట్రోలులో లేవుగనుక ఏ చెట్టుకైనా గుద్దుకోవచ్చు.

సీతాపతిగారు వారాని కో పర్యాయం మెకానిక్‌ను రప్పించి రిపేరీ చెయ్యిస్తాడు. కాని యేంలాభం? మెకానిక్ వెళ్ళిపోయిన మరుదినమే ఇంజన్ మొరాయిస్తుంది. పొద్దుస్తమానం దానితో కుస్తీపట్టి సాయంత్రం యింటికెళ్ళగానే యజమానితో ఫిర్యాదు చేస్తాడు: 'ఇంజన్ మంచిదేనండీ బాబుగారూ, కాని ఏం చేస్తాం? పాతపడిపోయింది. ఎక్కడ భాగా లక్కడ అరిగిపోయాయి. ఇంక రిపేరీ చెయ్యించడంవల్ల లాభంలేదు. దాన్నో మూలకు నెట్టేసి, కొత్త యింజన్ కొనేసెయ్యండి బాబూ—'

సీతాపతిగారు తేలిగ్గా జవాబు చెప్తారు: 'వోపిక పట్టాలి మస్తాన్. ఇంకా యెన్నాళ్ళుచేస్తుందో చెయ్యనీ. ఆ తర్వాత దాని ఆశ వదిలేసి కొత్త యింజన్ కొంటే సరిపోతుంది.' ఇల్లా సమాధానం చెబుతూ అతను ఏండ్లు దొర్లించాడు.

* * *

రావిచెట్టుకింద నిల్చుని బాబులుగాడు పిలుస్తున్నా వినకుండా, ట్రాక్టర్‌మీద కూర్చొని ఆలోచిస్తున్నాడు మస్తాన్. బాబులుగాడి ఏడో కూతకు తలెత్తాడు. సూర్యుడు నడినెత్తినున్నాడు. బాబులుగాడు తెచ్చిన అన్నం పాత్ర రావిచెట్టుకింద తెల్లగ కనిపిస్తూంది. పాట్ తీసి అక్కడేపడేసి, ఏట్లో కెళ్ళి ముఖం కడుక్కొని వచ్చి విస్తరిముందు కూర్చున్నాడు మస్తాన్.

'ఏమిటయ్యా నవాబూ, పదిసార్లు పిలిస్తేగాని వినపడకుండా వుండిపోయ్యావు. ఏమిటా దీర్ఘాలోచన?' అనడిగాడు బాబులు. వాడెప్పుడూ అతన్ని 'నవాబూ' అని పిలుస్తాడు.

'ఏముందిలేరా బాబులూ, మామూలే. ఆ పచ్చడి ఇలా అందుకో'

పచ్చడిగిన్నె విస్తరిముందు వుంచాడు బాబులు. ఆవురావురని తినసాగాడు మస్తాన్.

'అదేమిటి నవాబూ, ఈపాటికి పల్లంచేసు కూడా దుక్కి చెయ్యలేదు. ఈపూటకూడ ఇంజన్ మొండికేసిందేమిటి?'

'మొండికెయ్యకేంజేస్తుందిరా—ముసలిదయిపోయాక? ఎన్నిసార్లు చెప్పినా బాబుగారు కొత్తఇంజన్ కొనరైరి. దీనితో వేగలేక నా వొళ్ళు హూనం అయిపోతూంది.'

'పోనీలేవయ్యా, ఈరోజుతో నీ కష్టాలు గట్టెక్కుతాయి.' అన్నాడు బాబులు, దిగజారిపోతున్న నిక్కరును ఎగలాక్కుంటూ.

'అదేమిట్రా కుంకా—అలా అన్నావు?'

'బాబుగారు ఉదయం మద్రాసు వెళ్ళారు—తెలుసా?'

'అలాగా?! ఎందుకు?'

'ఎందుకేమిటి? కొత్తఇంజన్ తేవడానికి.'

'నిజం?!'

'నిజమే—ఇందా ఈ పెరుగు వేసుకో!

'చాలురా చాలు నాకింకేమీ వద్దు. కొత్త యింజన్ వస్తే పంచభక్ష్య పరమాన్నాలు తిన్నట్టే' అంటూలేచి చెయ్యి కడుక్కొన్నాడు మస్తాన్.

'ఆఁ—ఇక వెళతావా బాబులూ—నే కాసేపు నడుం వాలుస్తాను' అన్నాడు కండువాను ఇసుకమీద పరుస్తూ.

'అహాఁ అదేం కుదరదు. నీకు సంతోషం కలిగించే మాట చెప్పానుగా. నాకేదైనా బహుమతి ఇవ్వాలి' అన్నాడు బాబులు మారాంచేస్తూ.

'అవున్రా బాబులూ అడుగు—నీ కేం కావాలో అడుగు.'

'నాకేమీ వద్దు. కాగితం గాలిపటం చేసివ్వు. యించక్కా ఆడుకొంటా.

'హారి నీ యిల్లు బంగారంగాను, అంతేనా. ఏదీ ఆ అందుకో.

బాబులు ఇచ్చిన కాగితాన్ని రెండుగ చించాడు మస్తాన్. ఒకముక్కని మధ్యకిమడిచాడు. రెండోమడత యెలా మడవాలి? కుడివేపుకా? ఎడంవేపుకా? ఒకనిమి

షం తలగోక్కుంటూ ఆలోచించాడు. మరో నిమిషం వ్రేలు కొరుక్కుంటూ ఆలోచించాడు. ఎంతకీ స్ఫురణకి రాలేదు. మరచిపొయ్యారా బాబులూ. గాలిపటం రాలేదు, అన్నాడు చివరకు కాగితాన్ని గాల్లోకి వదిలేస్తూ. అలా అంటూంటే అతని కంఠం సన్నగ కంపించింది.

'మరెల్లా, నేనింక దేనితో ఆడుకోను?_ఏడుపుముఖంతో అన్నాడు బాబులు.

'పోనీలే. నీకు తోచిన ఆట చెప్పు—మనిద్దరం ఆడుదాం.'

'గోళీలాడుదామా?' అన్నాడు బాబులు జేబులోంచి గోళీలు బయటికి తీస్తూ.

'ఛీ. అసలా ఆటలో నేను అందెవేసినచేయి. నాతో ఆడావంటె చిత్తుగా వోడిపోతావు.'

'ఏం కాను. నువ్వే వోడిపోతావు. కావలిస్తే పందెం కాయి.'

ఆట ప్రారంభమైంది. రెండు నిమిషాలు గడిచాయి. చప్పట్లుకొట్టాడు బాబులు. 'చూశావా నవాబూ, నే చెప్పినట్టుగానే వోడిపోయావు. ఓడినందుకు నాకు పరిహారంగా ఏదయినా ముట్టజెప్పాలి.'

'ఏమి ముట్టజెప్ప మంటావురా కుంకా? అన్నాడు మస్తాన్ ముసిముసిగా నవ్వుతూ. ఆ క్షణంలో అతని కన్నుల్లో ఏదో దీనత్వం మెరిసింది.

'మరేం లేదు. ఓ చిన్న పాటపాడి వినిపించు.

'అంతేనా. సరే, ఆ ప్లేట్ ఇలా అందుకో. ఇటీవల పాడడం మానేశానుగాని, ఒకప్పుడు నేను మంచిపాటగాణ్ని తెలుసా?

ప్లేట్ మీద దరువు వేస్తూ పాట మొదలుపెట్టాడు మస్తాన్.

'ఊగే నీవొంటి సొంపు
నువు పాడేటి పాట సొంపు
.....
.....'

అంతే—ఆ తర్వాత చరణాలు స్ఫురణకు రాలేదు. రావిచెట్టు కొమ్మలకేసి చూస్తూ ఎంత సేపు ఆలోచించినా లాభం లేకపోయింది. చివరకు తలవంచుకొని, 'జ్ఞప్తికి రాలేదురా బాబులూ. చిన్నప్పుడీ పాట రోజూ పాడే వాడిని' అన్నాడు ప్లేటును కిందపెట్టేస్తూ.

'నీకేమీ రాదు, పాటరాదు, ఆటరాదు. అసలా ట్రాక్టరెతో ఎలా వేగుతున్నావో ఏమిటో—పొద్దుగూడ వాటారిపోయింది, నేవెళతాను' అంటూ వెళ్ళిపోయాడు బాబులు.

అడుగులో అడుగు వేసుకుంటూ పొలంలోకి నడవసాగాడు మస్తాన్. అతని మనసంతా ఏదో దిగులుగా వుంది. పెళ్ళికాక పూర్వం తనపాటలోని మాధుర్యం విని తనను ప్రేమించింది బేగం. తను చిన్నవాడుగా వుండేటప్పుడు ఒక్కో రోజు డజన్‌లకొద్దీ గాలిపటాలు తయారుచేసేవాడు. ఆ రోజుల్లో ఎవరుగాని ఏ ఆటలోగాని అతనితో పోటీ చెయ్యడానికి సాహసించేవారు కాదు.

గంగిరెద్దులా పొలంలో నిల్చునివున్న ట్రాక్టర్ని చూసేసరికి అతనికి వొళ్ళు మండిపోయింది. 'నీ సిగతరగా. ఇంకెంతకాలం నాగోడు పోసుకుంటావే. ఈపూటేగా. రేపిపాటికి నీకో సవతిని తెస్తానుచూడు' అనుకున్నాడు మనసులో, హాట్ పెట్టుకుని సీటుపై కూర్చున్నాడు మస్తాన్. పొద్దుపోయేసరికి తాబేటినడకతో ఇల్లుచేరింది ట్రాక్టర్. దాన్ని షెడ్‌లోకి నెట్టి మంచంమీద కూర్చుని, బీడీకాలుస్తూ, ఊహలలో అసంఖ్యాకంగా మేడలు కడుతున్నాడు మస్తాన్. అన్నీ రేపు రాబోయే కొత్త యింజన్‌ను గురించే.

'ఏమండీ, సీతాపతిగారి యిల్లు ఇదేనా?'

తలెత్తి చూశాడు మస్తాన్. ఖాకీ పాంటూ, షర్టూ వేసుకుని, చేతిలో సూట్‌కేసుతో నిల్చుని వున్నాడొక యువకుడు.

'ఈ బంగళానే బాబూ. కాని ఆయనిప్పుడు లేరు.'

'నాకు తెలుసండి. మద్రాసులో వారితో మాట్లాడే వస్తున్నాను. వారే పంపించారు నన్ను,' వినయంగా చెప్పాడా యువకుడు.

'అలాగా? ఏం పనిమీద బాబూ?'

'నేను ట్రాక్టర్ డ్రైవ్ చేస్తానండి. ప్రస్తుతం సీతాపతిగారివద్ద వుండే డ్రైవరుకు వయస్సు చెల్లిపోతూందటగా. అందుకే నన్ను రమ్మన్నారు. అన్నం పెట్టి నెలకు అరవై యిస్తామన్నారు. వస్తానండీ' అనేసి—సూట్‌కేస్ వూపుకుంటూ వెళ్ళిపోయాడా యువకుడు.

మస్తాన్‌కు నోటంట మాటరాలేదు. ఎదురుగ గోడకు వున్న అద్దంలో అతని నీడ కనిపిస్తూంది. నెరసినవెంట్రుకల మధ్య బట్టతల, ముఖంమీది మడతలు అతన్ని చూసి సన్నగా నవ్వాయి వెక్కిరిస్తున్నట్టుగ.